సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 28 । జనవరి । 2024



ప్రజలకు అందుబాటులో ఉండాలి

అధికారులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.

- 9లో ▸



వరిలో సస్యరక్షణ..

వ్యవసాయ అధికారులు శనివారం పలు గ్రామాలలో పర్యటించారు. పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.4 /14.7

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

లక్ష్యం చేరుకోని మిల్లులపై చర్యలు తప్పవు



కామారెడ్డి క్రైం: కస్టం మిల్లింగ్ రైస్ లక్ష్యం చేరుకోని రైస్ మిల్లుల యజమానులపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శనివారం కామారెడ్డి డివిజన్‌లోని రైస్ మిల్లుల యజమానులతో సీఎంఆర్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలు పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. లేకపోతే మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయిస్ డీఎం అభిషేక్ సింగ్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కంది క్వింటాలుకు రూ. 10,100



మద్నూర్: మండల కేంద్రంలోని మార్కెట్‌లో శనివారం కందులకు భారీ ధర లభించింది. క్వింటాలుకు రూ. 10,100 ధర పలికింది. ఇటీవలి వరకు క్వింటాలుకు రూ. 8,800 మాత్రమే ఉంది. మంచి ధర లభిస్తుండడంతో రైతులు మార్కెట్‌కు కందులు తీసుకు వస్తున్నారు. మరికొందరు రైతులు ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో ఇంట్లో నిలువ ఉంచుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



గాంధారి: తిప్పారం, తిప్పారం తండా, గొల్లాడి తండాల్లో శనివారం యూనిసెఫ్ బృందం పర్యటించి, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించింది. ఏడు నెలల నుంచి రెండేళ్ల వయసులోపు పిల్లల తల్లులతో మాట్లాడారు. పిల్లల ఆహారపు అలవాట్లు, ఆరోగ్య విషయాల గురించి తెలుసుకున్నారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. వారి వెంట ఎల్లారెడ్డి సీడీపీవో సరిత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ త్రివేష, ప్రోగ్రామ్ అసోసియేట్ పర్సన్స్ భవాని, మాధురి, వినోదిని, భారతి ఉన్నారు.

ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవలపై సంతృప్తి



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని కాయకల్ప వైద్యాధికారుల బృందం శనివారం సందర్శించింది. ఆస్పత్రిలోని వివిధ విభాగాలతోపాటు పరిసర ప్రాంతాలను, రికార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. వైద్యసేవలు, పారిశుద్ధ్య వ్యవస్థ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి వైద్యాధికారికి కాయకల్ప బృందం సభ్యులు సాయికిరణ్, రాము పలు సూచనలు చేశారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్, ఆర్ఎంవో రహీం ఉన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస సమావేశం వాయిదా

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసుపై ఈ నెల 29న నిర్వహించనున్న అవిశ్వాస సమావేశం వాయిదా వేసినట్లు ఆర్డీవో రాజేంద్రకుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. అవిశ్వాస సమావేశంపై ఎంపీపీ హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తర్వాత సమాచారం ఇస్తామన్నారు. అలాగే 29న వైస్‌ఎంపీపీపై అవిశ్వాస సమావేశం యథావిధిగా కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీటీసీలు గమనించాలని కోరారు.

కామారెడ్డిలో ఎమ్మెల్యే ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం



రోడ్డుకోసం ఇల్లు త్యాగం

- సొంతింటిని కూల్చేయించిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- పట్టణ అభివృద్ధే ముఖ్యమని వ్యాఖ్య
- రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలని వినతి

అసెంబ్లీ ఎన్నికలలో ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్.. మరోసారి సంచలన నిర్ణయంతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారారు. రోడ్డు విస్తరణ కోసం ముందుగా తన ఇంటినే కూల్చివేయించి ఆదర్శంగా నిలిచారు. ఇది త్యాగం కాదని.. ప్రజలకు ఇచ్చిన మాటకోసం, అభివృద్ధి కోసం ఎంత దూరమైనా వెళ్తానని ఎమ్మెల్యే పేర్కొంటున్నారు. అందరూ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

కామారెడ్డి టౌన్ : రోడ్డు విస్తరణ సమయంలో విలువైన ఇళ్లు, దుకాణ సముదాయాలు కోల్పోవాల్సి రావడంతో బాధితులు ఆందోళనకు దిగడం సహజం. కానీ కొందరు తమకు వ్యక్తిగతంగా నష్టం కలుగుతున్నా త్యాగానికి సిద్ధపడతారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం అలా త్యాగానికి సిద్ధపడ్డారు. పుట్టి పెరిగిన, ఎన్నో జ్ఞాపకాలను పంచిన ఇంటిని తానే కూల్చివేయించారు.

రోడ్డు పరిశీలన

పంచముఖి హనుమాన్ ఆలయం ముందు రోడ్డును



ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయం వద్ద విస్తరణ పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆలయ ఈవోతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్, టీపీవో గిరిధర్‌లకు సూచించారు. విస్తరణ పనులు పూర్తి కాగానే వెంటనే నూతన రోడ్డు పనులు ప్రారంభించాలని ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

నష్టం జరిగినా ముందుకే..

ప్రజలకిచ్చిన మాటకోసం, పట్టణ అభివృద్ధి కోసం తాను ఎంత దూరమైనా వెళ్తానని, ఒకవేళ తనకు నష్టం జరిగినా వెనుకంజ వేయనని ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు. తన ఇంటిని కూల్చేసే సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు విస్తరణ కోసం ఇంటిని కూల్చివేయించడం గొప్ప విషయమో, త్యాగమో కాదన్నారు. ప్రజలు కూడా తమ సొంత జాగాను కాకుండా ఆక్రమణలో ఉన్న నిర్మాణాలు, షెడ్లను స్వచ్ఛందంగా తొలగించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎవరిని ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన తనకు లేదన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు. నెల రోజుల్లో విస్తరణ పనులు పూర్తి చేసిన అనంతరం 24 ఫీట్ల రోడ్డును వేస్తామన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, కామారెడ్డిలో ఒక్కొక్కటిగా రోడ్ల విస్తరణ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను విన్నవించాలని సూచించారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్‌లు వేస్తేనే అభివృద్ధి కాదన్నారు. ముందుగా రోడ్ల విస్తరణ జరగాలన్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. అధికారులు, ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

బాధను దిగమింగి..

కామారెడ్డి పట్టణ అభివృద్ధి, రోడ్ల విస్తరణపై ఎమ్మెల్యే కేవీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్ల రోడ్డు ఉండాలి. కానీ 30 ఫీట్ల వెడల్పు మాత్రమే ఉండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే కేవీఆర్ పట్టణ ప్రణాళిక విభాగం, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులతో చర్చించారు. రోడ్డు విస్తరణకు తన ఇల్లు అడ్డుగా ఉన్నట్లు గుర్తించిన ఆయన.. సుమారు వెయ్యి గజాల స్థలాన్ని అప్పగించేందుకు ముందుకువచ్చారు. పది రోజుల క్రితమే ఇంటిని ఖాళీ చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మారారు. శనివారం ఇంటిని దగ్గరుండి కూల్చివేయించారు. రెండు పొక్లెయిన్‌లు ఇంటిని నేలమట్టం చేస్తుండగా.. ఎమ్మెల్యే కళ్లలో బాధ కనిపించింది. పుట్టిపెరిగిన ఇంటిని కూల్చేస్తుండగా ఆయన గుండెల్లో బాధను అక్కడ ఉన్నవారు గమనించారు. ఎమ్మెల్యే చిన్ననాటి నుంచి ఆయనతో ఆ ఇంటిలో గడిపిన బంధువొకరు కన్నీరు పెట్టుకున్నారు.



పంచముఖి హనుమాన్ ఆలయంలో కొలతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- డబుల్ బెడ్ రూం ఇళ్లపై 30లోగా నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : అభివృద్ధి పనులు సక్రమంగా చేపట్టి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు తీయాలని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 30 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మండలాలవారీగా మంజూరైన ఇళ్లు, పూర్తయినవి, వివిధ దశల్లో ఉన్న వాటి పూర్తి సమాచారం అందజేయాలన్నారు. తహసీల్దార్‌లు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు రూ. 4 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ పాటిల్ తెలిపారు. కామారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలాలకు రూ.2 కోట్ల నిధులు వచ్చాయన్నారు. మంజూరైన నిధులతో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఇంజినీర్ ప్రసాద్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ మురళి, తహసీల్దార్లు, వివిధ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

దళిత బంధు కోసం ఆందోళన

నిధులు మంజూరు చేయాలని డిమాండ్



నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న దళితులు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో దళితబంధు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో దళితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సుమారు రెండు వందల మందికిపైగా నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం నిర్మించి, రాస్తారోకో చేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు తరలివెళ్లి ధర్నా చేశారు. డాక్యుమెంటేషన్ పూర్తయినవారికి వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ప్రేమ్ కుమార్, స్వామి, సంగి మోహన్, బాలమణి, రవి, రాజు, నర్సింలు, ఎల్లమ్మ, రాజయ్య, రవి, లింగం, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళితులు

ఐదుగురు సీఐలకు స్థానచలనం

కామారెడ్డి క్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలకు స్థాన చలనం కలిగింది. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా ఉన్న సంతోష్ కుమార్‌ను సదాశివనగర్ సర్కిల్‌కు, డీసీఆర్‌బీలో సీఐగా ఉన్న శ్రీధర్‌రెడ్డిని ఆర్మూర్ రూరల్‌కు, ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ రామన్, బిచ్కుంద సీఐ కృష్ణలను ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న జగడం నరేష్ బిచ్కుందకు, నిర్మల్ స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేస్తున్న రవీందర్ నాయక్ ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఐజీ కార్యాలయం నుంచి శనివారం జారీ అయ్యాయి.

చెరుకు సాగుకు చేయూత

- విత్తన కొరత తీర్చేందుకు ముందుకొచ్చిన ఫ్యాక్టరీ యాజమాన్యం
- రైతులకు రాయితీపై పంపిణీ

విత్తనాలను బెడ్‌లలో నింపుతున్న కూలీలు



సదాశివనగర్: జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతోంది. అయితే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సర్కారు సూచిస్తుండడంతో పలువురు ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు సాగును ప్రోత్సహిస్తోంది. డ్రిప్ ఇరిగేషన్ కోసం సబ్సిడీ సౌకర్యం కల్పిస్తోంది. రైతులు సాగు చేసిన చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు అయ్యే ఖర్చును కూడా యాజమాన్యమే భరిస్తోంది.

అయితే చెరుకు విత్తనం కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మేలు రకం విత్తనాల కోసం ఇతర రైతులపై ఆధారపడాల్సి వస్తోంది. విత్తన చెరుకుకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. కూలీలతో మేలురకం విత్తనాన్ని తయారు చేయిస్తోంది. ఇందుకోసం మధ్యప్రదేశ్ నుంచి కూలీలను రప్పించింది. రైతులకు ఒక విత్తనాన్ని సబ్సిడీపై రూ. 2.35 పైసలకు అందిస్తోంది. ఎకరానికి 1,500 మొక్కలకు రాయితీ ఇస్తున్నారు. అధిక దిగుబడులు సాధించే రైతులకు 750 విత్తన మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

దిగుబడిని పెంచడానికి...



చెరుకు దిగుబడిని పెంచడానికి రైతులను ప్రోత్సహిస్తున్నాం. విత్తన సమస్య లేకుండా చూస్తున్నాం. ఒకప్పుడు విత్తనం కోసం రైతులు నానా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ సమస్య లేకుండా చూస్తున్నాం. మంచి దిగుబడులు సాధించిన రైతులను ప్రోత్సహిస్తున్నాం. – వేణుగోపాల్‌రావు, గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్

ఎకరానికి 6 వేల మొక్కలు..

సాధారణంగా ఎకరం భూమిలో 6 వేల చెరుకు మొక్కలు నాటాలి. కానీ రైతులు 8 వేల వరకు మొక్కలు నాటుతున్నారు. మంచి దిగుబడి రావడానికి ఈ పద్ధతిని పాటిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇందులో 1,500 విత్తనాలను ఫ్యాక్టరీ సబ్సిడీపై అందిస్తుండడంతో రైతులకు కొంత మేర విత్తన భారం తగ్గినట్లయ్యింది.



కణుపులను కట్ చేస్తున్న కూలీలు

సంఘాలను బలోపేతం చేయాలి

సదాశివనగర్: గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని డీపీఎం రవీందర్‌రావు సూచించారు. శనివారం మండల పరిషత్‌లో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అంశాలు, సంఘాల సమావేశాల పనితీరు, అకౌంటింగ్, స్త్రీనిధి రుణాలు, ఎంటర్‌ప్రైజెస్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు అబ్బ లింగం, ఆంజనేయులు, గొర్రె రాములు, నరేందర్ రెడ్డి, సౌజన్య, కృష్ణాంజలి, సూపర్‌వైజర్ లత తదితరులు పాల్గొన్నారు.



అప్పుడే పాతాళానికి..

వేసవి సీజన్ రాకముందే భూగర్భ జలమట్టం పడిపోతోంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పాతాళానికి చేరుకుంది. దీంతో బోర్లు ఎత్తిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. యాసంగి పంటల కోసం రైతులు మళ్లీ బోర్లు తవ్విస్తున్నారు. వందల అడుగుల లోతుకు వెళ్లినా నీరు పడకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు.

- వేగంగా పడిపోతున్న భూగర్భజలాలు
- బోర్లు తవ్వించి నష్టపోతున్న రైతులు
- యాసంగి పంటలకు కష్టకాలం



మాచారెడ్డి మండలం సోమారంపేటలో నీరు పడకపోవడంతో వృథాగా ఉన్న బోరుబావి

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో 2022 డిసెంబర్‌లో సరాసరిన 7.08 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. 2023 డిసెంబర్‌లో సరాసరి నీటిమట్టం 9.31 మీటర్ల లోతులో ఉంది. నవంబర్‌లో 8.13 మీటర్ల లోతున్న ఉన్న నీరు డిసెంబర్ నాటికి మీటరుకుపైగా లోతులోకి వెళ్లింది. జనవరి నెలలో 11 మీటర్లలోతుకు పడిపోయింది. మెట్ట ప్రాంతమైన భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో 25 మీటర్లు, తాడ్వాయి మండలం కన్కల్‌లో 25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి.

మళ్లీ బోర్లు తవ్విస్తున్న రైతులు

యాసంగి పంటలను కాపాడుకోవడం కోసం రైతులు మళ్లీ బోర్లు తవ్విస్తున్నారు. గతంలోలాగే రైతులు భూగర్భజలాల కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 4 వందల అడుగుల నుంచి 6 వందల అడుగుల వరకు తవ్విస్తున్నారు. కొన్నిచోట్ల మాత్రమే నీళ్లు పడుతున్నాయి. చాలా వరకు నీళ్లు పడకపోవడంతో నష్టపోతున్నారు. ఎంతలోతుకు వెళ్లినా నీరు రావడం లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే యాసంగిలో తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. నీటి సమస్య రావచ్చని భావించిన రైతులు.. పంటల సాగుకు వెనకా ముందయ్యారు. వేసిన కొద్దిపాటి పంటలకు కూడా నీరందించలేని పరిస్థితి తలెత్తుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ఈసారి గతేడాదికన్నా వర్షాలు తక్కువగా కురిశాయి. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాకాలం సీజన్‌లో రైతులు నీటిని ఎక్కువగా వాడడంతో భూగర్భ జలమట్టం తగ్గిపోతోంది. రైతులు నీటిని పొదుపుగా వాడేందుకు ప్రయత్నించాలి. వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేస్తేనే నీటి సమస్యను అధిగమించవచ్చు.
– సతీష్‌యాదవ్, జిల్లా భూగర్భజలశాఖ అధికారి

వట్టిపోతున్న బోర్లు..

భూగర్భజలమట్టం వేగంగా పడిపోతున్న నేపథ్యంలో బోర్లు వట్టిపోతున్నాయి. రామారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి, రాజంపేట, గాంధారి, మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల్లో భూగర్భజలాలు వేగంగా అడుగంటుతుండడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, కామారెడ్డి, మాచారెడ్డి, రామారెడ్డి, బీబీపేట, రాజంపేట, భిక్కనూరు, దోమకొండ మండలాల్లో ఎక్కువ సంఖ్యలో బోర్లు ఎత్తిపోతున్నట్లు తెలుస్తోంది. గతేడాది జిల్లాలో 1,405 మి.మీ. వర్షపాతం నమోదవగా, ఈసారి 1,014 మి.మీ. వానే పడింది. సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ పెద్ద ఎత్తున పంటలు సాగు చేయడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. జిల్లాలో లక్షా 10 వేల బోర్లు, బావులు ఉన్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో భూగర్భజలమట్టం భారీగా పడిపోవడంతో వందలాది బోర్లు ఎత్తిపోయాయి.



క్లుప్తంగా

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్ : గవర్నర్ కోటాలో నూతనంగా ఎన్నికైన తెలంగాణ జన సమితి పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్‌ను జిల్లా టీజేఎస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, కార్యదర్శి జడల రజినీకాంత్, నాయకులు పూల్ సింగ్ తదితరులు సత్కరించారు.

టెస్ట్‌మ్యాచ్‌ను తిలకించిన విద్యార్థులు



పిట్లం(జుక్కల్): హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఇండియా–ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను శనివారం మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు తిలకించారు. బ్లూబెల్స్ పాఠశాల నిర్వాహకులు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 220 మంది విద్యార్థులను బస్సుల్లో హైదరాబాద్ తీసుకెళ్లామన్నారు. పాఠశాల సిబ్బంది రజని, దేవాగౌడ్ ఉన్నారు.

వేల్పూరి నిత్యశ్రీకి కలెక్టర్ ప్రశంసలు



మాచారెడ్డి : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నృత్యం చేసిన మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన వేల్పూరి నిత్యశ్రీకి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ ప్రశంసలు అందుకున్న నిత్యశ్రీని శనివారం గ్రామస్తులు అభినందించారు.

14 మంది రిమాండ్

వేల్పూర్: మండలంలోని వాడిలో కుల బహిష్కరణ చేసిన గురడికాపు సంఘం సభ్యులు 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన నర్సయ్య తన వ్యక్తిగత సమస్యను పరిష్కరించడానికి కుల సంఘ సభ్యులు రూ. 13 లక్షలు చెల్లించాలని నిబంధన విధించినట్లు తెలిపారు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో సంఘ సభ్యులు కుల బహిష్కరణ చేసినట్లు తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం

- నియోజకవర్గాల్లో వరి, ఆరుతడి పంటలను పరిశీలించిన అధికారులు
- రైతులకు సూచనలు, సలహాలు



చిన్నఎక్లారలో ఆరుతడి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బీబీపేట : వరిపొలాల్లో ప్రస్తుతం ఉన్నటువంటి కాండం తొలుచు పురుగు (మొగి పురుగు)ను నియంత్రించడానికి రైతులు పలు రకాల చర్యలు తీసుకోవాలని ఏఈవో రాఘవేంద్ర అన్నారు. శనివారం మండలకేంద్రంతో పాటు జనగామ గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో మొగి పురుగును గుర్తించారు. దాని నివారణకు వరి నాటిన 20 రోజుల్లోపు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున ఇసుకతో కలిపి వేస్తే మొగి పురుగును నియంత్రించుకోవచ్చని రైతులకు సూచించారు. 20 రోజుల దాటిన వరికి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ మందును ఎకరానికి 400 గ్రాములు, క్లోరాంతనిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా టెట్రానిలిప్రోలు 100 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలన్నారు. పొలాల గట్ల మీద కలుపు వల్ల, అధిక యూరియా వాడకం వల్ల అగ్గి తెగులు కూడా కొన్ని చోట్ల ఆశించిందని దాని నివారణకు ట్రియసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు.

చిన్న ఎక్లారలో..

మద్నూర్(జుక్కల్) : మండలంలోని చిన్న ఎక్లార శివారులో యాసంగిలో సాగవుతున్న మినుము, పొద్దు తిరుగుడు, వేరుశనగ, జొన్న పంటలను శనివారం ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌రెడ్డి, రేవంత్ పరిశీలించారు. పంటలను పరిశీలించిన అనంతరం వారు రైతులతో మాట్లాడుతూ మినుము పంటలో ప్రధానంగా పూతలో మారుక మచ్చల పురుగు అధిక ఉధృతిని గమనించామన్నారు. దీనికి స్పైనోసడ్ 75 మిల్లీ మందును ఎకరాకు లేదా ఫ్లుబెన్డైమైడ్ 100 గ్రాముల మందును నీటిలో కలిపి ఎకరాకు పంటకు పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా బుడిద తెగులు నివారణకు వెట్టబుల్ సల్ఫర్ 200 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పంటలో ఆకు ముడత తెగులు గమనించినట్లు వాటి నివారణకు ప్రొఫెనోఫాస్ 50ఈసీ 500 మీల్లీ ఎకరాకు పిచికారి చేయాలని వివరించారు. కుసుమ పంటలో పేనుబంక నివారణకు అసిటమిప్రైడ్ 50 గ్రాముల మందును ఎకరాకు కలిచి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏఈఏ కిషన్, ఏవో రాజు, రైతులు రాజు, బస్వరాజ్, ప్రకాష్, రాజుపటేల్ ఉన్నారు.

శెట్లూర్‌లో..

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని శెట్లూర్ గ్రామ శివారులో శనివారం ఏవో రాజలింగం వరి పంటను పరిశీలించారు. వరి పంటకు పోషకాల లోపం ఉందని గుర్తించామన్నారు. రైతులు ప్రతిరోజు పంటను పరిశీలించాలని, ఏదైనా చీడపీడలు ఆశిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సంప్రదించాలని సూచించారు. ఏఈవో సౌమ్య, రైతులు ఉన్నారు.

తిప్పాపూర్‌లో..

భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్‌లో శనివారం వరిపంటలను మండల వ్యవసాయాధికారి రాధ పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆందోళన చెందవద్దన్నారు. సర్పంచ్ స్వామి, ఎండోమెంట్ చైర్మన్ సిద్ధరాములు, రైతులు ఉన్నారు.



బీబీపేటలో వరిని పరిశీలిస్తున్న ఏఈవో రాఘవేంద్ర



తిప్పాపూర్‌లో..



బిచ్కుంద మండలం శెట్లూర్‌లో..

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



చిన్నమల్లారెడ్డిలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డిలోని చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – కామారెడ్డి రూరల్

ఒకరికి జరిమానా

నిజాంసాగర్: మండల కేంద్రంలోని వారంతపు సంతలో బహిరంగ ధూమపానం చేస్తున్న వ్యక్తికి పోలీసులు శనివారం జరిమానా విధించారు. సంతలో కూరగాయల విక్రయానికి వచ్చిన సదరు వ్యక్తి బహిరంగంగా ధూమపానం చేస్తుండటంతో పోలీసులు కనిపెట్టి ఆన్‌లైన్ ద్వారా జరిమానా విధించారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ 3, 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, లా కాలేజ్, సౌత్ క్యాంపస్ భిక్కనూర్, ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కాలేజ్, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాల్లో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1,699 మందికి 1,609 మంది హాజరు కాగా 90 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 181 మందికి 180 హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని కంట్రోలర్, ఆడిట్ సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి,చిప్ప నారాయణ, మోహన్ తదితరులున్నారు.

సేవారంగంలో సహకారం ఉండాలి

- పరస్పర సహకారంతోనే సమస్యల పరిష్కారం
- 24వ పెన్ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న పెన్ రాష్ట్ర ప్రతినిధి లక్ష్మీనారాయణ పటేల్

కామారెడ్డి టౌన్ : వ్యాపార పరిచయాలు, సేవారంగంలో పరస్పర సహకారమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ ముందుకు వెళ్లాలని పటేల్ ఎంట్రిప్రెన్యూర్ నెట్వర్క్ (పెన్) రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ పి లక్ష్మీనారాయణ పటేల్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో 24వ పెన్ సదస్సును నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో ఎక్కడ సమస్య ఎదురైనా పరస్పర సహకారంతో క్షణాల్లో పరిష్కరించుకునేందుకు 'పెన్' వేదికగా నిలుస్తుందన్నారు. ఇందుకోసం అన్నివర్గాల వారు భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రముఖ కవి, మోటివేషన్ స్పీకర్ మున్నూరు కాపు సంఘం సౌత్ ముంబై ప్రధాన కార్యదర్శి సంఘవేణి రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కనెక్టివిటీతో ముందుకు వెళ్లవచ్చన్నారు. పెన్‌లో ఆ కనెక్టివిటీ, యూనిటీ ఉందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఒకరికొకరి సహకారంతో సమచారం, సమన్వయం, పరిచయాలతో ఏ రంగంలోనైనా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. 25వేల సభ్యులుగా ఉన్న ఈ 'పెన్' గ్రూప్‌లో త్వరలోనే దేశంలో 25 లక్షలకు చేరుకోబోతున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పెన్ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు తోట దేవేందర్, నీలం లింగం, సదానందం, భాస్కర్, రమేష్, శ్రీధర్ సభ్యులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న నరేశ్

కామారెడ్డి టౌన్ : యువత దేశభక్తిని అలవర్చుకోవాలని ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేశ్ తెలిపారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కళాభారతిలో శనివారం నిర్వహించిన యువజన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి యోధులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువజన పోటీల్లో విజేతలకు నిలిచిన వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజుసాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ కృష్ణ, విభాగ్ వ్యవస్థాపము స్వామి, జిల్లా ప్రభు గిరి, నగర అధ్యక్షులు అనిల్, నాయకులు రోహిత్, ఖలీల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి వాసవీ కాలనీలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో 2024–25కు గాను ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ ఇంతియాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో మైనారిటీలకు 26, బీసీలకు 5, ఎస్సీ, ఎస్టీలకు 4, క్రిస్టియన్లకు 2, జైన్, బౌద్ధులకు 4, ఓసీలకు ఒక సీటు రిజర్వు చేయబడిందని, విద్యార్థులు నేరుగా కళాశాలలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చన్నారు. 89788 47884లో సంప్రదించవచ్చన్నారు.

మైనారిటీ పాఠశాలలో ప్రవేశాలకు..

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కామారెడ్డి బాలుర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రవేశాలకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పి నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7 తరగతుల ప్రవేశాల ప్రవేశాలకు జిల్లాలోని ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ కోరారు.

మైనారిటీ బాలికల పాఠశాలలో..

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కామారెడ్డి బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రవేశాలకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల ప్రవేశాల ప్రవేశాలకు జిల్లాలోని ముస్లిం, క్రిష్టియన్ మైనారిటీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు 79950 57920ను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ ప్రణీత కోరారు.

గాయత్రి షుగర్స్‌లో జోరుగా క్రషింగ్

- ఇప్పటిదాకా 2.7 లక్షల మెట్రిక్ టన్నులు..
- రోజుకు 3,700 టన్నుల మేర క్రషింగ్



మాగి గాయత్రి కర్మాగారం

నిజాంసాగర్(జుక్కల్) : వానాకాలం చెరుకు సాగు చేసిన రైతులు క్రషింగ్ కోసం మాగి గాయత్రి చక్కెర కర్మాగారానికి తరలిస్తున్నారు. నిజాంసాగర్ మండలం మాగి గాయత్రి కార్మాగారంలో రోజుకు 3,700 మెట్రిక్ టన్నుల చొప్పున చెరుకు క్రషింగ్ జోరుగా సాగుతోంది. నవంబర్ నెల 7వ తేదీ నుంచి మాగి గాయత్రి కార్మాగారంలో చెరుకు క్రషింగ్ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 2.7 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు కేన్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి తెలిపారు. కార్మాగారం పరిధిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. చెరుకు పంట సాగు అగ్రిమెంట్ చేసుకున్న రైతులు చెరుకు నరికిస్తూ, లారీలు, ట్రాక్టర్లల్లో కార్మాగారానికి తరలిస్తున్నారు.

టన్నుకు రూ. 3,463 ధర చెల్లింపు

మాగి గాయత్రి కార్మాగారం పరిధిలో చెరుకు పంట సాగు చేసిన రైతులకు టన్నుకు రూ. 3,463 చొప్పున ధరను చెల్లిస్తున్నారు. ఉమ్మడి మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల పరిధిలో 9వేల ఎకరాల్లో రైతులు చెరుకు పంట సాగు చేశారు. ఆయా గ్రామాల్లో చెరుకు పంట సాగు చేసిన రైతులకు కార్మాగారం తరఫున గిట్టు బాటు ధర అందిస్తున్నారు. చెరుకు పంట నూర్పిడి కోసం కార్మాగారం తరుపున 23 చెరుకు నూర్పిడి యంత్రాలు, 80 ముఠాలు, 150 వాహనాలను సిద్ధం చేశారు. దాంతో ఆయా గ్రామాల్లో చెరుకు పంట నూర్పిడి చేస్తూ, కార్మాగారానికి చెరుకును తరలిస్తున్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి):మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2,26,612 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి



పోడు భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

మాచారెడ్డి : కబ్జాలో ఉన్న పోడు రైతులకు హక్కు పత్రాలు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లంపేట, బంజపల్లి, అంకిరెడ్డిపల్లి తండా, గుడి తండా, మంగలి గడ్డ తండాల్లోని పోడు భూములను శనివారం పరిశీలించారు. ఈనెల 29న కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నాను రైతులు రావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్, జిల్లా కమిటీ నాయకులు దర్శన్, మధు తదితరులున్నారు.

క్రైం కార్నర్

వ్యాపారంలో నష్టాలు భరించలేక ఆత్మహత్య



సంతోష్‌కుమార్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: వ్యాపారంలో నష్టాలు భరించలేక మనస్తాపానికి గురైన ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్మూర్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ధన్‌పాల్ సంతోష్‌కుమార్(45) పాత బస్టాండ్‌లోని ఓ షాప్‌లో పలు కంపెనీలకు చెందిన ఏజెన్సీలను నిర్వహిస్తున్నాడు. దీంతో వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన సంతోష్ ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం పట్టణ శివారులోని గుండ్ల చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం నిమిత్తం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సంతోష్ మృతదేహంగా నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మహమ్మద్‌నగర్‌లో బైక్ చోరీ

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఓ స్వీట్ హోం ఎదుట నిలిపి ఉంచిన బైక్ శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని బాలాజీ స్వీట్ హోం నిర్వాహకుడు నరేశ్ తన షాప్ ఎదుట బైక్ నిలిపి ఉంచాడు. శనివారం ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించడం లేదని దీనిని అదునుగా చేసుకొని దుండగులు చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజ్ చేసిన వాహనంలోని టేప్ రికార్డర్..

వర్ని: మండల కేంద్రంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో నిలిపి ఉంచిన ఓమ్ని వాహనం నుంచి గుర్తు తెలియని దుండగులు టేప్ రికార్డర్‌ను చోరీ చేసినట్లు అటవీశాఖ అధికారులు శనివారం తెలిపారు. నెల రోజుల క్రితం ఓ కేసు విషయమై వాహనాన్ని సీజ్ చేసి కార్యాలయంలో ఉంచినట్లు చెప్పారు. గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి వాహనం అద్దాలను పగులగొట్టి టేప్ రికార్డర్‌ను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పరిధిలోని ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు హాజరై ఇంటిరి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సూర్యనగర్‌లో..

నగరంలోని సూర్యనగర్‌లో నివాసం ఉంటున్న వినయ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఈనెల 25న రాత్రి ఇంటి నుంచి వెళ్లిన వినయ్ తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వినయ్ భార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.


అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



వినోద్ (ఫైల్)

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన తలారి వినోద్ (33) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట్ మండలం పోతంగల్‌కు చెందిన వినోద్ న్యాల్‌కల్‌కు చెందిన మౌనికతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇల్లరికంగా వచ్చిన వినోద్ న్యాల్‌కల్‌లోనే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అతను భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి సైతం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చి వారిని సముదాయించి వెళ్లిపోయారు. శనివారం ఉదయం అనుమానాస్పదస్థితిలో వినోద్ గదిలో మృతి చెందాడు. దీంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



సాయన్న మృతదేహం

బాల్కొండ: మండలంలోని బోదపల్లికి చెందిన రైతు గడ్డం చిన్నసాయన్న (60) గత గురువారం వరద కాలువలో కొట్టుకు పోయిన విషయం విధితమే. కాలువలో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వద్ద వరద కాలువలో శనివారం కొట్టుకుపోతూ కనిపించడంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసముందర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 3660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

'చరిత్ర విద్యార్థులను వివేకవంతులను చేస్తుంది'



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లావణ్య బెన్

భిక్కనూరు : చరిత్రను క్రమపద్ధతిలో చదవడం వల్ల విద్యార్థులు వివేకవంతులవుతారని ప్రొఫెసర్ లావణ్యబెన్ అన్నారు. శనివారం తెయూ హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్ ఏర్పాటుచేయగా ఆమె హాజరై మాట్లాడారు. చరిత్ర రచనలో జాతీయవాద, మార్క్స్, విశ్లేషణాత్మక వంటి వివిధ ఆలోచన విధానాలు, శాస్త్రీయ చరిత్ర విధానం అన్నారు. గత చరిత్రను అధ్యయనం చేయడం, మెరుగైన భవిష్యత్ నిర్మాణానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హిస్టరీ విభాగపతి డాక్టర్ రాజేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలకు రెబీస్ టీకా వేయించాలి



కుక్కకు రెబీస్ టీకా వేస్తున్న వైద్యులు

బాన్సువాడ రూరల్ : పెంపుడు కుక్కలకు ప్రతి ఏడాది తప్పనిసరిగా యాంటీ రెబీస్ టీకాలు వేయించాలని బాన్సువాడ పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ రోహిత్‌రెడ్డి సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం బాన్సువాడలోని పశువుల ఆస్పత్రిలో 24 కుక్కలకు యాంటీ రెబీస్ టీకాలు ఇచ్చి, పెంపకందారులకు సూచనలు చేశారు. కుక్క కర్చిన వెంటనే గాయాన్ని దుస్తుల సబ్బుగాని డెటాల్‌తో కాని శుభ్రపర్చాలన్నారు. కుక్క కరిచిన తర్వాత 1, 3, 7, 14, 28వ రోజుల్లో టీకాలు వేయించుకోవాలన్నారు. వీధుల్లో సంచరించే ఆవులు, దూడలు అనారోగ్యానికి, రోడ్డు ప్రమాదానికి గురైతే వెంటనే 1962కు ఫోన్‌చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేష్, సంధ్య, విఠల్,బాలరాజు,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఆటో బోల్తా

■ ఒకరి మృతి, పలువురికి గాయాలు

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆటోనగర్‌లో డివైడర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. బోధన్ నుంచి నిజామాబాద్‌కు ఆరుగురి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఆటోనగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మారుతి (20) తలకు తీవ్ర గాయాలు కావడంతో మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగితా వారికి గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ వీరయ్య తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.